భేషజాలకు పోవద్దు.. బిల్లులివ్వండి

- జవాబుల కోసం సమస్యల్ని దాటేయొద్దు
- వాస్తవాల తగ్గట్టు నిర్ణయాలు తీసుకోండి
- పాఠశాలలను నిర్లక్ష్యం చేయొద్దు
- సర్కారుకు హరీశ్‌రావు సూచన

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): ప్రాథమిక విద్యను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పాఠశాలల నిర్వహణను గాలికి వదిలేయడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, మధ్యాహ్న భోజన సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి లేఖ ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే అసలు సమస్యలే లేవన్నట్టు విద్యాశాఖ ప్రకటించడం సరికాదని, తన లేఖపై భేషజాలకు పోయి, సమాధానాలిచ్చేందుకు సమస్యలను దాటవేయొద్దని సూచించారు. సమస్యలు పరిష్కరించకుండా వాస్తవాలను పక్కనబెట్టడం వల్ల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నష్టం జరుగుతున్నదని ధ్వజమెత్తారు. విద్యాశాఖలో రాష్ట్రవ్యాప్తంగా సమస్యలున్నాయని నిర్ధారించేందుకు సోమవారం తన నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత పూర్తి వివరాలను విద్యాశాఖ దృష్టికి తెచ్చారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కారానికి డిమాండ్ చేశారు.

ఇవీ సమస్యలు

- కుక్ కం హెల్పర్లకు చెల్లించే రూ.3 వేల గౌరవ వేతనాలు గతేడాది డిసెంబర్ వరకే వచ్చాయి. 2024 జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, జూన్‌కు సంబంధించి వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయి.
- 9, 10వ తరగతి మధ్యాహ్న భోజన బిల్లులు 2024 జనవరి వరకే వచ్చాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, జూన్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.
- 1-8వ తరగతి వరకు బిల్లులు 2024 ఏప్రిల్ వరకే వచ్చాయి. జూన్ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి.
- కోడిగుడ్డు బిల్లులు 2024 జనవరి వరకే వచ్చాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, జూన్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.
- సర్వశిక్ష అభియాన్, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ల (ఐఈఆర్‌పీ) వేతనాలు 2024 మే వరకే వచ్చాయి. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి.
- గతంలో గ్రామ పంచాయతీలే పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టేవి. ఈ బాధ్యతను 'అమ్మ' కమిటీలకు అప్పగిస్తామన్న మాట ప్రకటనకే పరిమితమైంది. వెంటనే ప్రతిస్కూల్‌కు నెలకు 10 వేలు విడుదల చేసి, పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి.
- సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని సహృదయంతో పునఃప్రారంభించాలి.
- పాఠశాలలకు ఉచిత కరెంట్ ఇస్తామన్న హామీ మాటలకే పరిమితమైంది. అధికారిక ఉత్తర్వులేక పాఠశాలల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే ఉత్తర్వులివ్వాలి.
- ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లిచ్చిన నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 9వేల ఖాళీలు ఏర్పడ్డాయి. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ పూర్తయ్యేలోగా పిల్లలకు విద్యాబోధన అందేలా వలంటీర్లను నియమించాలి.
- గతేడాది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రీమెట్రిక్ స్కాలర్ షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని వెంటనే విడుదల చేయాలి.

ఏడు నెలలైనా ఎన్నికల బిల్లులు రాలే

కేంద్ర ఎన్నికల సంఘానికి కాంట్రాక్టర్ల ఫిర్యాదు

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్‌కు బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల్లో ఈవీఎంల తరలింపు, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు, డీఆర్‌సీ సెంటర్లలో ఏర్పాట్లు, కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయడానికి టెండర్లను పిలిచారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు సంబంధించి 20 కోట్ల బిల్లులు రావాలని కాంట్రాక్టర్ సుంకరి సత్తయ్య తెలిపారు.

డీటీలకు జిల్లా స్థాయిలోనే బదిలీలు

రెవెన్యూ శాఖ ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ) : డిప్యూటీ తహసీల్దార్లు(డీటీ), సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు జిల్లా స్థాయిలోనే బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ ఆదేశించింది. ఈ మేరకు సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్లు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జిల్లా దాటి వెళ్లాలనుకునేవారి ప్రతిపాదనలను సీసీఎల్‌ఏకు పంపాలని సూచించారు. దీని నుంచి జోన్-6(చార్మినార్)ను మినహాయించారు. ఈ జోన్ నుంచి వచ్చే దరఖాస్తులను సీసీఎల్‌ఏకు పంపాలని ఆదేశించారు. అదేవిధంగా బదిలీలపై నిషేధం ఎత్తివేసినందుకు ట్రెసా నేతలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్, ఉపాధ్యక్షుడు నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫిరాయింపులపై సత్వర విచారణ జరగాలి

హైకోర్టుకు బీఆర్ఎస్ అభ్యర్థన

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ తరపున ఎన్నికల్లో గెలుపొందిన కొద్దిరోజులకే కాంగ్రెస్ పార్టీలో చేరిన శాసనసభ్యులపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ పూర్తిచేయాలని బీఆర్ఎస్ పార్టీ హైకోర్టును కోరింది. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై స్పీకర్ చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు జారీచేయడం వల్ల ఇతర ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపుల బాటలోకి వెళ్లకుండా ఉంటారని సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు చెప్పారు. ఆ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద వేర్వేరుగా వ్యాజ్యాలను దాఖలుచేశారు. వీటిపై సోమవారం జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి మరోసారి విచారణ చేపట్టారు. ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్ తుది నిర్ణయం తీసుకునే వరకు కోర్టు ల జోక్యానికి ఆస్కారం లేదని 1992లో సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం తీర్పు చెప్పిందని, కాబట్టి ఈ వ్యాజ్యాల్లో ఉత్తర్వుల జారీ చేయనక్కర్లేదని అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదించారు. అనంతరం తదుపరి విచారణను కోర్టు ఈ నెల 11కు వాయిదా పడింది.

అదానీకి పాతబస్తీ కరెంటిస్తే ఊరుకోం

- ఎన్నికల హామీలను కాంగ్రెస్ విస్మరించింది
- ఒక్క మైనార్టీ మంత్రి కూడా లేడు
- మైనార్టీలకు 4వేల కోట్లు కేటాయించాలి
- మాజీ మంత్రి మహమూద్ అలీ డిమాండ్

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పాతబస్తీలో విద్యుత్తు వ్యవస్థను అదానీకి అప్పగిస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి మహమూద్‌అలీ హెచ్చరించారు. ఒకవైపు అదానీని రాహుల్‌గాంధీ వ్యతిరేకిస్తుంటే.. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఆయనను ఆహ్వానిస్తున్నాడని, దీనిపై జాతీయ కాంగ్రెస్ స్పందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మహమూద్ అలీ మీడియాతో మాట్లాడారు. పాతబస్తీలో విద్యుత్తు బిల్లుల వసూలును అదానీ సంస్థకు అప్పజెప్పాలని తీసుకున్న నిర్ణయం మైనార్టీలను అవమానపరచడమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో మైనార్టీలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు ప్రతి ఏటా బడ్జెట్‌లో రూ.2వేల కోట్లను కేటాయించింది, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.4 వేల కోట్లు కేటాయిస్తామన్నారని, వచ్చే బడ్జెట్‌లో కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ అనాథల కోసం అనీస్ ఉల్ గర్బాను నిర్మించారని, ఆ భవనాన్ని ఇతర కార్యకలాపాలకు ఉపయోగిస్తే ఆనాథల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో మైనార్టీ మంత్రి లేకపోవడం విచారకరమని అంటూ.. కేసీఆర్ మైనార్టీలకు డిప్యూటీ సీఎం, హోం మంత్రి పదవి ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీ పదవి ఇచ్చినా అది ఇంకా కార్యరూపం దాల్చలేదని అన్నారు.

పాతబస్తీలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

పాతబస్తీలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, నిత్యం హత్యలు జరుగుతున్నాయని మహమూద్ అలీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మతకలహాలు కూడా పెరిగిపోయాయని చెప్పారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో శాంతిభద్రతలను పటిష్ఠంగా కాపాడామని, మత ఘర్షణలు జరగకుండా చూశామని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బీజేపీకి బీ టీంగా పనిచేస్తున్నదని, అందుకే మైనార్టీలకు మంత్రి పదవి ఇవ్వడం లేదని విమర్శించారు. బీజేపీతో ఉన్న చంద్రబాబుకు కాంగ్రెస్ సీఎం రేవంత్ ఘనస్వాగతం పలకడం ఇందులో భాగమేనని అన్నారు. రాహుల్‌గాంధీ ఢిల్లీలో బీజేపీతో కొట్లాడుతుంటే.. రేవంత్ ఇక్కడ బీజేపీతో స్నేహం చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో మైనార్టీలు కాంగ్రెస్‌కు ఓట్లేసినా వారి సంక్షేమం కోసం రేవంత్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. మైనార్టీలకు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా రేవంత్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాఠశాలా.. చెరువు కుంటా?

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తిలోని సర్కారు పాఠశాల ఆవరణ.. ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి జలమయమైంది.సోమవారం విద్యార్థులు పాఠశాలకు వచ్చి చూడగా.. స్కూల్ ఆవరణ మొత్తం వర్షపునీటితో చెరువును తలపించింది. స్కూల్ లోపలికి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండటంతో తిరిగి ఇండ్లకు వెళ్లిపోయారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి సైడ్, అండర్ డ్రైనేజీలకు మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు. -ఐనవోలు

మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత

భైంసా మండలం దేగాం పాఠశాలలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన

భైంసా టౌన్, జూలై 8: నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని దేగాం జిల్లా పరిషత్, ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులు ఈ నెల 4న మధ్యాహ్న భోజనం చేశాక అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం ఇంటికెళ్లిన విద్యార్థులు వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. వెంటనే స్థానిక ఆర్ఎంపీకి చూపించి చికిత్స అందించారు. శనివారం రాత్రి జ్వరం తీవ్రం కావడంతో భైంసా ఏరియా దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం ఏడుగురు విద్యార్థులు చికిత్స పొందుతున్నారని, ఫుడ్ పాయిజన్ వల్లనే విద్యార్థులు అస్వస్థకు గురయ్యారని వైద్యులు తెలిపారు. ఈ విషయమై మండల విద్యాధికారి సుభాష్‌ను వివరణ కోరగా.. సోమవారం దవాఖానకు వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నామని, విద్యార్థులు కోలుకుంటున్నారని తెలిపారు.

భైంసా ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న దేగాం పాఠశాల విద్యార్థులు

టూరిజం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డికి వినతి

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): టూరిజం కార్పొరేషన్ పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేతలు కోరారు. ప్రధానంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పటేల్ రమేశ్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ మౌళి, జ్యోతి, రచన, గోపి, రమేశ్, చంద్ర మౌళి, ఇక్బాల్ పాల్గొన్నారు.

'హోటల్ లీజ్' నిరూపించండి

- రాజకీయాల నుంచి తప్పకుంటా
- అవాస్తవమైతే మీరు తప్పకుంటారా?
- కాంగ్రెస్ నేతలకు శ్రీనివాస్‌గౌడ్ సవాల్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 8: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న టూరిజం హోటల్‌ను తాను 99 ఏండ్లపాటు లీజుకు తీసుకున్నానని మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పిన మాటలు అవాస్తవమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. ఒకవేళ ఆరోపణలను నిరూపిస్తే 'నేను రాజకీయాల నుంచి తప్పకుంటానని, అవాస్తవమైతే మీరు తప్పకుంటారా?' అని సవాల్ చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'అధికారంలో ఉన్నది మీ ప్రభుత్వమే కదా నిరూపించండి.. ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తా. రోగుల బంధువులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఎదుట షాపింగ్ కాంప్లెక్స్, హోటల్ నిర్మాణం చేపట్టాం' అని వివరించారు. పనులను పూర్తి చేసే ప్రయత్నం చేయకుండా తప్పుడు ఆరోపణలతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో జేఎన్‌టీయూ క్యాంపస్ ఏర్పాటుకు జీవో జారీ చేసినా.. ఇప్పటివరకు దాని ఊసే ఎత్తడం లేదని శ్రీనివాస్‌గౌడ్ దుయ్యబట్టారు.

టోకెన్ విధానం మాకొద్దు

దీంతో పైరవీకారులకే ప్రయోజనం • కాంట్రాక్టర్లను, ఉద్యోగులను ఒకే గాటన కట్టడం సరికాదు

డీఏలు 5 వేల కోట్లు, బిల్లులు 3 వేల కోట్లు పెండింగ్‌లోనే

తక్షణమే సప్లిమెంటరీ బిల్లులను, డీఏలను విడుదలచేయాలి

మాక్కావాల్సింది ఐఆర్ కాదు.. 41% ఫిట్‌మెంట్

'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల వేతనాలు, బిల్లులు జారీచేసేందుకు అనుసరిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్), టోకెన్ల ద్వారా బిల్లుల జారీ విధానం తమకొద్దని, దీనిని తక్షణమే రద్దుచేయాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విధానంతో పైరవీకారులకే ప్రయోజనం కలుగుతున్నదని స్పష్టంచేశారు. కాంట్రాక్టర్లు, ప్రజాసేవ చేసే ఉద్యోగులను ఒకే గాటన కట్టడం సరికాదని పేర్కొన్నారు. ఐఎఫ్ఎంఐఎస్, టోకెన్ విధానంలో వేతనాలు చెల్లించడం, బిల్లులు జారీచేయడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు స్పష్టంచేశారు. ఒకటో తేదీన జీతం పడటం, బిల్లు సమర్పించిన మరుసటి రోజే జారీకావడమన్నది ఉద్యోగులకున్న ప్రివిలేజ్‌గా అభివర్ణించారు. ఐఎఫ్ఎంఐఎస్, టోకెన్ విధానంలో ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ విభాగాలు నామనాత్రమయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దీనిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులంతా ఏకమై రాష్ట్రాన్ని సాధించుకున్నారని, అనేక ప్రభుత్వాలను పడగొట్టిన ఘనత ఉద్యోగ సంఘాలకు ఉన్నదని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వమని కొంతకాలం ఆగుతున్నామని, సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. 'నమస్తే తెలంగాణ'కు ఏలూరి శ్రీనివాసరావు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలయ్యాయా?

ఉద్యోగులకు సంబంధించి ఆరు హామీలను కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టారు. అవన్నీ రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలి. ఒకట్రెండు డిపార్ట్‌మెంట్లు మినహా ఒకటో తేదీన జీతాలు తీసుకుంటున్నాం. ఇందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మాడల్ స్కూల్ సిబ్బందికి, మార్కెట్ కమిటీ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలివ్వాలి. సీపీఎస్‌ను ప్రభుత్వం రద్దుచేస్తుందని నమ్ముతున్నాం. జీవో-317పై కమిటీ వేశారు. హడావుడిగా కాకుండా కేసుల వారీగా స్పౌజ్, లోకల్, మ్యూచువల్ వంటి సమస్యలను పరిష్కరించాలి. మళ్లీ సమస్యలు తలెత్తకుండా పరిష్కారం చూపాలి. పెండింగ్‌లోని, దీర్ఘకాలిక సమస్యలు త్వరగా పరిష్కారం కావాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు. మరీ ముఖ్యంగా ప్రాథమిక సభ్యుల్లో తమ సమస్యలు సత్వరమే పరిష్కారం కావాలన్న భావన వ్యక్తమవుతున్నది. దీనిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.

పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించిందా?

రాష్ట్రంలో మొత్తంగా రూ.5 వేల కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయి. ఇటీవలి కాలంలో రూ.2 వేల కోట్ల వరకు పెండింగ్ బిల్లులను చెల్లించినట్టు సమాచారం ఉన్నది. 3 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిని కూడా వెంటనే చెల్లించాలి. గత ప్రభుత్వంలోనివే కాకుండా కొత్త ప్రభుత్వంలోనూ ఆరు మాసాలుగా బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పటివరకు రూ.లక్ష లోపున్న బిల్లులు మాత్రమే జారీ అయ్యాయి. గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు గల బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.

పీఆర్సీ ఆలస్యం కావడం పట్ల మీ స్పందన..?

ఇప్పుడున్న పీఆర్సీ కమిటీ గడువును అక్టోబర్ వరకు పొడగించారు. కమిటీ నివేదిక సమర్పించి, కొత్త పీఆర్సీ అమలయ్యేసరికి డిసెంబర్ వరకు పట్టవచ్చు. 41% ఫిట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. పీఆర్సీ కమిటీకి ప్రతిపాదనలిచ్చాం. తరుచూ పీఆర్సీ కమిటీతో భేటీ అవుతున్నాం. 5% మధ్యంతర భృతి ఇవ్వడం అశాస్త్రీయం. మేమిప్పుడు ఐఆర్ కోరుకోవడంలేదు. మా డిమాండ్లల్లో ఐఆర్ లేదు. మెరుగైన ఫిట్‌మెంట్‌ను సాధించాలన్నదే లక్ష్యం.

హెల్త్‌కార్డుల సమస్య తీరిందా..?

ఉద్యోగులకు పదిహేనేండ్ల నుంచి హెల్త్‌కార్డులు లేవు. ఉద్యోగుల హెల్త్‌కార్డులంటేనే అటు ఇన్స్యూరెన్స్ కంపెనీలు, ఇటు దవాఖానలు నమ్మడం లేదు. బిల్లులు పెండింగ్‌లో ఉండటమే ఇందుకు కారణం. హెల్త్‌కార్డులు లేక ముఖ్యంగా పెన్షనర్లు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌తో లాభం జరగడం లేదు. 30 ఏండ్ల క్రితం ఖరారు చేసిన ధరలే ఇప్పటికీ అమలవుతున్నాయి. ఒక వ్యాధికి రూ.8 లక్షలు ఖర్చయితే కేవలం రూ.80 వేలు ఇస్తున్నారు. అదీ టోకెన్ విధానంలో రెండేండ్లు దాటిన తర్వాత ఆయా డబ్బులు వస్తున్నాయి. ఇదేం విధానం? ప్రభుత్వం తక్షణమే గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన ఈహెచ్ఎస్ విధానాన్ని అమలుచేయాలి. నగదురహిత, అపరిమిత చికిత్సనందించాలి.

ఉద్యోగులకు పదోన్నతులొచ్చాయా..?

ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టడం హర్షణీయం. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి. ఎన్నికలకు ముందే డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీలు (డీపీసీ) ఏర్పాటయ్యాయి. డీపీసీ సమావేశాలను త్వరగా నిర్వహించి శాఖల వారీగా పదోన్నతులు కల్పించాలి. జీవో-317 ద్వారా ఉద్యోగుల కేటాయింపు అశాస్త్రీయంగా జరిగింది. కొత్త జిల్లాల ప్రకారం క్యాడర్ స్ట్రెంత్‌ను మంజూరుచేయాలి. అన్ని శాఖల్లో ఖాళీలను వెంటనే భర్తీచేయాలి. నోటిఫికేషన్లు ఇచ్చిన పోస్టులను వెంట వెంటనే భర్తీ చేసి, ఉద్యోగులను కేటాయించాలి.

ఉద్యోగులకు తగిన గౌరవ దక్కుతున్నదా..?

ఏ ప్రభుత్వమైనా ఉద్యోగుల్ని మూడో తరగతి పౌరుల్లా చూస్తున్నది. ఉద్యోగులకు ఎన్నో చేశామని చెప్తుంటారు కానీ, అరకొరగానే అమలుచేస్తున్నారు. కేంద్రం, రాష్ట్రం అనే తేడాల్లేకుండా అన్ని ప్రభుత్వాలు ఇదే విధానాన్ని అమలుచేస్తున్నాయి. సంఘాల నాయకులుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించగలమన్న ధీమాతో ఉన్నాం. సమస్యలు పరిష్కరించగలమన్న నమ్మకం ఉన్నది. అయితే కొత్త ప్రభుత్వమని, కొంత వెసులుబాటు ఇవ్వాలని ఆగాం. మా డిమాండ్లు పరిష్కారం కాని పక్షంలో సోదర సంఘాలను కలుపుకుని జేఏసీ పక్షాన ఉద్యమిస్తాం.

గతంలో ఒకట్రెండు డీఏలకే గొడవచేశారు. ప్రస్తుతం ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నా ఎందుకు మౌనం వహిస్తున్నారు?

> గతంలో ఏ పీఆర్సీని కూడా సమాయానికి ఇవ్వలేదు. డీఏలు సమయానికి రాలేదు. పెండింగ్‌లోని డీఏలను త్వరగా ఇవ్వాలని కిందిస్థాయి ఉద్యోగులు కోరుకుంటున్నారు. పెండింగ్‌లోని ఐదు డీఏల మొత్తం రూ.5 వేల కోట్లు బాకీ పడింది. మూడు డీఏలు ఎలాగూ పీఆర్సీలో కలుస్తాయి. కనీసం రెండు డీఏలనైనా తక్షణమే విడుదల చేయాలి. ఇదే విషయంపై పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డిని, సీఎస్‌ను కలిశాం. ఉద్యోగులంతా డీఏలు విడుదల చేయాలని కోరుతున్నారు. దీనిపై మాపై ఉద్యోగుల నుంచి ఒత్తిడి ఉన్న మాట వాస్తవం. ప్రభుత్వం కనీసంగా రెండు డీఏలైనా విడుదల చేస్తే ఉపశమనం దొరుకుతుంది.

ఉద్యోగులకు రైతుబంధు, రుణమాఫీ వద్దు అంటున్నారు.. మీరేమంటారు..?

> ఉద్యోగులంటేనే ప్రజల్లో వ్యతిరేక భావన స్థిరపడింది. ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చేవేవీ వారికి వద్దు.. ఇవ్వొద్దు అనే భావన వ్యక్తమవుతున్నది. ఈ రోజు ఆఫీసు సబ్బాన్లనేట్ జీతమెంత? తిప్పికొడితే రూ.20 వేల జీతం రాదు. కానీ, ఆ ఉద్యోగి తల్లికి పెన్షన్ రాదు. ఆ ఇంటికి రేషన్ కార్డు ఉండదు. బరాబర్ ట్యాక్స్ కట్టేది మేమే. బరాబర్ పనిచేసేది మేమే. కానీ మేమంటేనే ఈర్ష్య పడుతుంటారు. ఉద్యోగం వచ్చిందంటే కుటుంబం మొత్తానికి తెల్లకార్డు కట్. అన్ని రాయితీలు కట్. ఇంట్లో నలుగురుంటే ఒక్కరికి ఉద్యోగం వస్తే మిగతా ముగ్గురిని ఇబ్బంది పెట్టడం భావ్యమా? తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టడం సమంజసమా? కుటుంబసభ్యుల్లోనూ ఉద్యోగులంటే వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. రైతుబంధు, రుణమాఫీపై ప్రభుత్వం ఈ దిశలో ఆలోచించాలి.

లోకం పోకడ

నిరుద్యోగ నిర్మూలనకు ఇది మార్గం కాదేమో సార్!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	36.3°c	23.7°c
రంగారెడ్డి	34.2°c	21.7°c
మెదక్	33.8°c	22.9°c
నిజామాబాద్	33.1°c	23.5°c
మహబూబ్‌నగర్	32.4°c	24.6°c
ఖమ్మం	32.0°c	25.0°c
నల్లగొండ	31.0°c	22.4°c
కరీంనగర్	31.0°c	25.0°c
వరంగల్	31.0°c	25.0°c
హైదరాబాద్	30.1°c	23.7°c

13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, జూలై